ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 17.0

ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలి

- రెండో రోజూ నూజివీడులో కొనసాగిన జేఏసీ నిరసన

■ లోపలి పేజీలో..


ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు

- తుఫాన్ హెచ్చరికలతో రైతుల బెంబేలు
- తేమ శాతం తగ్గించేందుకు అదనపు ఖర్చులు

ముదినేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ఆరుగాలం శ్రమించి పండించిన పండించిన సార్వా ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ముదినేపల్లి ప్రాంతంలో సుమారు 6 వేల ఎకరాల్లో సార్వా వరి కోతలు పూర్తి కాగా, ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించే ప్రక్రియ కష్టసాధ్యంగా మారింది. వరి కోత యంత్రాలతో కోసి, ధాన్యాన్ని పొలాల్లో ఆరబెట్టేందుకు అవకాశం లేక సుమారు కిలోమీటరు పైగా దూరంలోని రోడ్లకు చేర్చాల్సి వస్తోంది. ఈ క్రమంలో పొలాల్లో లోడు ట్రాక్టర్లు దిగబడి పోతుండడంతో తీవ్ర సమస్యగా మారింది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ధాన్యంలో తేమను 17 శాతానికి తగ్గించాలంటే ఐదు రోజులు ఆరబెట్టాల్సి వస్తోంది. తేమశాతం 17 కంటే ఎక్కువ ఉంటే బస్తాకు రూ.100 నుంచి రూ.150 వరకు మిల్లర్లు తగ్గించి కొంటున్నారు. ఎకరాకి వరి కోత యంత్రం ఖర్చు నుంచి ధాన్యాన్ని మిల్లుకు చేర్చే వరకు సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఖర్చు అవుతోంది. మరో పక్క తుఫాన్ హెచ్చరికలతో ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు హడావిడి పడుతు న్నారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిముక్కిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫిట్‌లెస్ బస్సులు

- తరచూ మొరాయిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు
- వారం రోజుల పాటు జిల్లాలో స్పెషల్ డ్రైవ్

■ లోపలి పేజీలో..

హోదా మారింది!


జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ కార్యాలయం

గ్రేడ్-1 మునిసిపాలిటీగా జంగారెడ్డిగూడెం

- జీవో విడుదల చేసిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ
- 29 నుంచి 33 లేదా 35కు పెరగనున్న వార్డులు

జంగారెడ్డిగూడెం,నవంబరు 28(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీ గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 పురపాలక సంఘంగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఈ మేరకు ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం జీవో ఎంఎస్ నెంబర్-243 జారీచేశారు.

మేజర్ పంచాయతీ నుంచి..

2011లో పట్టణంలో 48,994 జనాభా ఉండగా మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయ్యింది. రెండేళ్లపాటు ప్రత్యేకాధికారి పరిపాలనలో వున్న తర్వాత 2013లో మొదటిసారి నగర పంచాయతీ ఎన్నికలు జరిగాయి. మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు ఉన్న 20 వార్డులతోనే ఎన్నికలకు వెళ్లారు. మొదటి నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా టీడీపీ నుంచి బంగారు శివలక్ష్మి ఎన్నికయ్యారు. పట్టణ ఆదాయ వనరులు పెరగడం, జనాభా పెరగడంతో గ్రేడ్-2 మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని అప్పటి మున్సిపల్ కౌన్సిలర్ నంబూరి రామచంద్ర రాజు బోర్డు తీర్మానంతో హైకోర్టును ఆశ్రయించారు. 2019లో హైకోర్టు ఆదేశాల మేరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రేడ్-2 మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది. 20 వార్డులను 29 వార్డులుగా విభజించారు.

గ్రేడ్-1గా ప్రమోషన్

గ్రేడ్-1 మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ అవడంతో ప్రస్తుతం ఉన్న 29 వార్డులు 33 నుంచి 35 కు చేరే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రూ.20 కోట్ల బడ్జెట్‌తో రూ.15 కోట్ల ఆదాయంతో పట్టణం అభివృద్ధి చెందుతోంది. పట్టణంలో 70 వేలకు పైగా జనాభా ఉండడం, ఆదాయ వనరులు, గ్రేడ్-1 మునిసి పాలిటీకి తగినట్లుగా అన్ని అర్హతలుండడంతో ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రస్తుత పాలకవర్గం 2023లో తీర్మానం చేసి మున్సిపల్ శాఖకు పంపినా అప్పట్లో ప్రత్యేక దృష్టి పెట్టలేదు. అప్పటి ఎమ్మెల్యే పెద్దగా పట్టించుకోలేదు.

ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గ్రేడ్-2గా ఉన్న మునిసిపాలిటీని గ్రేడ్-1 మార్చడానికి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రస్తుతం ఉన్న పాలక వర్గం నూతనంగా తీర్మానం చేయడానికి సుముఖత చూపక పోవడంతో 2023లో మున్సిపల్ శాఖకు పంపిన తీర్మానం ఆధారంగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ 2025 అక్టోబరులో మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర మంత్రులను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి లేఖ అందించారు. నిత్యం ఉన్నతాధికా రులు, సంబంధిత - మిగతా 8వ పేజీలో

అర్హులందరికీ ఉచిత ఉపకరణాలు

- సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్

ఏలూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరా లు గల పిల్లలకు(సీడబ్ల్యుఎస్ఎన్) సమగ్రశిక్ష జిల్లా ప్రాజెకు ద్వారా ఉచితంగా ఉపకరణాలు అందజేసేందుకు నియోజక వర్గాల వారీగా చేపట్టిన వైద్య నిర్ధారణ శిబిరం శుక్రవారం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అశోకవర్ధిని మున్సిపల్ స్కూలులో జరిగింది. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్ కుమార్ మాట్లాడుతూ సీడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కల్పించే సదుపాయాలను ఉపయోగించు కుని పిల్లల సమగ్ర వికాసానికి కృషి చేయాలన్నారు. విలీన విద్య జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కరరాజు, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, సీఎంవో యెహోషువ, ఏఎస్‌వో రామకృష్ణ, స్కూలు హెచ్‌ఎం ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపులో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ, తదితరులు

త్వరలోనే కారం మిల్లు ప్రారంభం

- జీసీసీ డీఎం విజయలక్ష్మి



బుట్టాయగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):గిరిజన సహకార సంస్థ ద్వారా బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన కారం మిల్లును త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని జీసీసీ డీఎం ఎం.విజయలక్ష్మి తెలిపారు. జీసీసీ ఎండీ ఆదేశాల మేరకు శుక్రవారం జీసీసీ బృందం మండలంలో పర్యటించి కారం మిల్లు, సూపర్ మార్కెట్, పెట్రోల్ బంక్, గ్యాస్ గొడౌన్‌లను పరిశీలించారు. మార్కెటింగ్ మేనేజర్ (ఆర్ఎండీ) త్రినాథరావు, మార్కెటింగ్ జీఎం శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ సీహెచ్ రాజయోగి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



నిడమర్రు నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిసెంబరు 1న ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, కలెక్టరు వెట్రిసెల్వి, ఎస్పీ కె.పి.ఎస్. కిశోర్ శుక్రవారం చేబ్రోలు, గొల్లగూడెం గ్రామాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలీప్యాడ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసే ప్రాంతం ఎంపిక, రూట్ మ్యాప్, భద్రతా చర్యలు, కేడర్ సమావేశం వేదిక, పార్కింగ్, సభకు వచ్చే ప్రజల సౌకర్యాల గురించి పర్యవేక్షించారు. పలు శాఖల ఉన్నతాధి కారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : ఎంపీ



ఏలూరుటూటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. చొదిమెళ్లలో రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎకరానికి నీరు ఇవ్వాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ చొదిమెళ్లలో 1206 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేశామన్నారు. అనంతరం రైతులకు ముఖ్యమంత్రి రాసిన లేఖను అందజేశారు. ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, తహసీల్దార్ గాయిత్రీదేవి, శనివారపుపేట సొసైటీ బ్యాంక్ చైర్మన్ కోనేరు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సన్నద్ధం

- డిసెంబరు 7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష
- జిల్లా నుంచి 2,660 మంది విద్యార్థుల దరఖాస్తు



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిని ఉన్నత విద్యవైపు నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం చేయూతనందిస్తోంది. ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) స్కీమ్‌లో భాగంగా పైచదువుల కోసం స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఏటా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తోంది. అర్హత పొందిన వారికి నాలుగేళ్ల అంటే 9, 10వ తరగతితో పాటు, ఇంటర్మీడియేట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ఏటా రూ.12 వేలు చొప్పున రూ.48వేలు స్కాలర్‌షిప్‌గా అందజేస్తారు. జిల్లాలో 2,660 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు దరఖాస్తు చేశారు. వీరికి డిసెంబరు 7వ తేదీన పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష నిర్వహణకు జిల్లాలోని ఏలూరు డివిజన్‌లో 6, నూజివీడు డివిజన్‌లో మూడు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో మూడు మొత్తం 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో సుమారు 240 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న క్రమంలో పాల్గొనే విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 150 మార్కులకు ఈ పరీక్ష జరగనుంది. 7వ తరగతి సిలబస్‌కు సంబంధించి 75 మార్కులకు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ కింద మరో 75 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఓఎంఆర్ షీట్‌పై జవాబులు ఇవ్వాలి. ఆ దిశగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

అందుబాటులో హాల్‌టిక్కెట్లు : డీఈవో


ఏలూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) డిసెంబరు 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని డీఈవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హాల్‌టిక్కెట్లను మన-వాట్సాప్‌లో అందుబాటులో ఉంచామన్నారు. హాల్ టిక్కెట్లలో ఏవైనా సవరణలుంటే సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ధ్రువీకరించిన లేఖతో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను కలిసి సెంటర్ నామినల్ రోల్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని కోరారు. పరీక్ష కేంద్రం లొకేషన్‌ను హాల్ టిక్కెట్‌పై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

ఫీజు పేరిట వసూళ్ల దందా!

- పదో తరగతి విద్యార్థులకు లిస్టుల అందజేత
- నిబంధనల బేఖాతర్.. కొందరు హెచ్‌ఎంల నిర్వాకం

భీమడోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు పేరుతో ప్రభుత్వ హైస్కూల్లో వసూళ్ల దందా ప్రారంభమైంది. కార్పొరేట్ పాఠశాలల తరహాలో ఏకంగా లిస్టులు తయారుచేసి విద్యార్థులకు ఇచ్చి సొమ్ము కట్టాలంటూ మండలంలోని రెండు హైస్కూళ్ల హెచ్‌ఎంలు ఆదేశించడం గమనార్హం.

ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్ష ఫీజు రూ.125 నిర్ణయించారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజు వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీచేసినా కొందరు హెచ్‌ఎంలు ఆ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ సొమ్ము వసూళ్ల ప్రారంభించారు. గ్రూపు ఫొటోలకు, స్పెషల్ ఫీజు లు, గేమ్స్ ఫీజులు, ఇన్సూరెన్సు, ప్రాసెసింగ్ ఫీజుల పేరిట విద్యార్థుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారు. కళాశాల స్థాయిలో వసూలు చేసే మిస్సెలియన్స్ ఫీజును హైస్కూళ్లలో వసూలు చేసేందుకు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. మండలంలో మొత్తం ఐదు హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో గుండుగొలను జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ తతంగం తారస్థాయికి చేరింది. ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.350 ఫీజుల పేరిట వసూలు చేసేందుకు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. భీమడోలు హైస్కూల్‌లో రూ.175 వసూలు చేస్తున్నారు. మిగిలిన హైస్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఫీజు చెల్లించమంటున్నారు. గుండుగొలను హెచ్‌ఎం సునీతను వివరణ కోరగా 'వసూళ్లపై జిల్లా స్థాయి విద్యా శాఖ అధికారులకు నేను వివరణ ఇస్తాను' అంటూ తెలిపారు. మరోవైపు గుండుగొలను హైస్కూల్‌లో పాఠశాల తరగతులు జరిగే సమయంలో విద్యార్థులతో గార్డెన్ పనులు చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



10th class fees

Exam fees	-	125
Group photo	-	110
Special fees	-	20
games fees	-	15
Insurance fees	-	25
Processing fees	-	25
miscellaneous fees	-	30
Total	→	350

పరీక్ష ఫీజుతో ఇతర ఖర్చులను చూపుతూ విద్యార్థులకు ఇచ్చిన లిస్టు


గుండుగొలనులో గార్డెన్ పనులు చేస్తున్న విద్యార్థులు

నిధులొచ్చాయ్!

రహదారులకు మహర్దశ


పుట్లగట్లగూడెం వద్ద జంగారెడ్డిగూడెం-ఏలూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులు

వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులకు పైసా విదల్చకపోవడంతో గ్రామీణ రహదారులన్నీ ఛిద్రమయ్యాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు మొర పెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం రావడంతో రోడ్లపై దృష్టి సారించి నియోజక వర్గాల వారీగా రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తోంది. తాజాగా చింతలపూడికి రూ.52 కోట్లు, నూజివీడుకు రూ.10 కోట్లు నిధులు విడుదల చేసింది.

చింతలపూడి నియోజకవర్గం.. రూ.52.46 కోట్లతో పనులు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రహదారుల నిర్మాణాలు మా బాధ్యతంటూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ హామీలు నెరవేరుస్తున్నారు. సంక్రాంతి పండుగ టార్గెట్‌గా చింతలపూడి నియోజక వర్గంలో దాదాపు రూ.52 కోట్లు విలువైన రోడ్డు పనులు మొదలయ్యాయి. నియోజకవర్గంలో పాడైన రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలకు పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, జడ్పీ నిధులు మొత్తం రూ.52.46 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభ మయ్యాయి.వీటిలో పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.22.55 కోట్లు, ఆర్‌అండ్‌బీకి సంబంధించి రూ.24.91 కోట్లు, జడ్పీ నిధులు రూ.5కోట్లు విలువ చేసే పనులు జరుగుతున్నాయి.

నిధులు మంజూరైన రోడ్లు

కామవరపుకోట మండలంలోని కామవరపుకోట-యడవల్లి రహదారికి రూ.4కోట్లు, జీలకర్రగూడెం-కామవరపుకోట వయా అంకాలంపాడు రోడ్డు రూ.7.70కోట్లు, లింగపాలెం మండలంలోని లింగపాలెం-టీసీహెచ్‌ఆర్‌పాలెం రూ.3.80 కోట్లు, అయ్యప్ప రాజుగూడెంకు రూ.55 లక్షలు, చింతలపూడి-కామవరపుకోట రూ.1.80 కోట్లు, చింతలపూడి-రావికంపాడు వయా టి.నరసాపురం రోడ్డు రూ.1.57 కోట్లు, చింతలపూడి-గురుపట్లగూడెం రూ.3.80 కోట్లు, దేవులపల్లి-లక్కవరం రూ.70లక్షలు, ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వరకు అక్కడక్కడ 6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.10.27 కోట్లతో పనులు జరుగుతున్నాయి. వీటితో పాటు జడ్పీ నిధుల కింద శ్రీనివాసపురం రోడ్డుకు రూ.80 లక్షలు, అక్కంపేటకు రూ.50 లక్షలతో పాటు మరో రూ.3.50 కోట్లు రోడ్డు నిర్మాణాలు జరగనున్నాయి.


ముసునూరు మండలం కొర్లగుంట రోడ్డు దుస్థితి

నూజివీడు రహదారులకు రూ.10 కోట్లు

(నూజివీడు-ఆంధ్రజ్యోతి):

నూజివీడు నియోజకవర్గంలో పంచాయతీరాజ్ రహదారుల మరమ్మతులకు రూ.10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో ఈసారి ముసునూరు మండలానికి రహదారుల మరమ్మతుల్లో ప్రాధాన్యత లభించింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పార్థసారథి నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు నిధులు సాధించడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. మంత్రి అయిన తొలి నెలలో నూజివీడు మండలంలో కొన్నగుంట, నూజివీడు పట్టణంలో ప్రధాన రహదారి సీసీ రోడ్డుగా నిర్మాణానికి అనుమతి, నిధులు సాధించి పనులు చేయించారు. అయితే కాంట్రాక్టర్ నాసిరకం పనులు నిర్వహించడంతో విమర్శలు రావడంతో మంత్రి కాంట్రాక్టర్‌ను పిలిచి మందలించారు.

నిధులు మంజూరైన రహదారులు

ఆగిరిపల్లి మండలంలో చొప్పరమెట్ల - సద్గురు రహదారిపై 3.70 కిలోమీటర్లు పరిధిలో మరమ్మతులకు రూ.150 లక్షలు, ముసునూరు మండలం పరిధిలో సింహాద్రిపురం కొర్లగుంట రహదారి 1.35 కిలోమీటర్ల పరిధికి రూ.కోటి, అక్కిరెడ్డిగూడెం-గోగులపాడు రహదారి 4.70 కిలోమీటర్లకు రూ.కోటి, ఆగిరిపల్లి మండలం కొత్త ఎదర-నూజివీడు రహదారికి నాలుగు కోట్లు, ఆగిరిపల్లి మండలం కట్లూరు-నూజివీడు రహదారికి 70 లక్షలు, ముసునూరు మండలం పరిధిలో రమణక్కపేట సూరేపల్లి తుమ్మగూడెం రహదారి మూడు కిలోమీటర్లకు రూ.180 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

ఎయిర్‌పోర్టు రహదారిపై దృష్టి సారించాలి

నియోజకవర్గంలో ఆగిరిపల్లి నుంచి గన్నవరం రోడ్డు మరమ్మతులు రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. తెలంగాణ నుంచి సత్తుపల్లి అశ్వారావుపేట, ఖమ్మం ప్రాంతాల ప్రజలు గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారి నిర్మాణం ప్రారంభమై పూర్తికాకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవడంతో పాటు వాహనాల టైర్లు దెబ్బతినడం, ప్రయాణ కాలం ఆలస్యం అవుతోంది. ఈ ప్రధాన రహదారి నిర్మాణం పూర్తయి తారు రోడ్డు ఏర్పడితే నూజివీడుకు మంచి కనెక్టివిటీ రోడ్డు ఏర్పాటు అవుతుంది. దీనిపై మంత్రి దృష్టి సారించి ఈ రహదారికి నిధులు విడుదల చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



వాలీబాల్ టోర్నమెంట్‌లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన సెయింట్ థెరిస్సా కళాశాల జట్టుకు కప్‌ను అందజేస్తున్న అధికారులు

వాలీబాల్‌లో సెయింట్ థెరిస్సాకు ప్రథమ స్థానం

ఏలూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు శుక్రవారం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య శిక్షణ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అంతర్ కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలిపారు. టోర్నమెంట్‌లో అద్భుత క్రీడాపటిమను కనబరిచిన పి.నాగవినయశ్రీ, పి.కావ్య, ఎం.శిరీష చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరుగునున్న దక్షిణ మండలం (సౌత్‌జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల స్పోర్ట్స్ మీట్‌లో నన్నయ యూనివర్సిటీ తరపున పాల్గొనే వాలీబాల్ జట్టుకు అర్హత సాధించారని వివరించారు. వీరితోపాటు సీహెచ్.పల్లవి జట్టుకు స్టాండ్‌బైగా ఎంపికైందని తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన కళాశాల జట్టు క్రీడాకారిణులను ఫిజికల్ డైరెక్టర్ మేజర్ పీ.ఎం.సెలీన్‌రోజ్, పీఈటీ శ్యామల, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, సిస్టర్ సుశీల, తదితరులు అభినందించారు.

జిల్లా క్రికెట్ జట్టుకు సీఆర్ఆర్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఏలూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగాల్లో క్రికెట్ ఎంపికలకు శుక్రవారం వంగూరు ఏఎస్ఎం క్రికెట్ అకాడమీలో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ల్లో ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు జిల్లాస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి.సాయికుమారి తెలిపారు. అండర్-17 విభాగంలో ఎస్కే సాహల్, వివేక్‌జైన్, ఎన్.జ్ఞానకౌశిక్, అండర్-14 విభాగంలో సీహెచ్.నాగమనోహర్ జిల్లా జట్లకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్ అభినందించారు

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు జయశ్రీ



బుట్టాయగూడెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డిసెంబరులో చెన్నైలో నిర్వహించే సౌత్‌జోన్ వాలీబాల్ జాతీయ పోటీలకు బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని గుడివాక జయశ్రీ ఎంపికైంది. ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో జయశ్రీ ప్రతిభ కనబరచడంతో ఆమెను ఎంపిక చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున సౌత్‌జోన్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నట్టు ప్రిన్సిపాల్ డా.మనేంద్రరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్‌కు సాయి దీపక్



టి.నరసాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు సాయిదీపక్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బిఎల్ స్వామి తెలిపారు. టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయిదీపక్‌కు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు స్వామి మాట్లాడుతూ ఈ నెల 24న ఏలూరు జిల్లా వంగూరులో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయిదీపక్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికై గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మో దుగ లక్ష్మణరావు, పిడి రామకృష్ణ, కెవి నారాయణ పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్‌లో సెయింట్ జోసఫ్‌కు ద్వితీయ స్థానం

పెదవేగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):రాజమండ్రి జీ ఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్రీడా మార్చ్‌ఫాస్టులో దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని అందుకున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నవంబరు 28వ తేదీ నుంచి 30 వరకు మూడు రోజులపాటు జరిగే క్రీడాపోటీలు శుక్రవారం క్రీడాకారుల మార్చ్‌ఫాస్టుతో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 36 మెడికల్ కళాశాలలు పోటీల్లో పాల్గొనగా మార్చ్‌ఫాస్టులో సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలకు ద్వితీయ బహుమతి లభించిందని కళాశాల పీడీ ఎన్.నల్లయ్య తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు క్రీడాకారులతోపాటు పీడీ నల్లయ్యను అభినందించారు.


తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూల్లో విజయకేతనం స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీచైర్మన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే శ్రీనివాస్

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం

తాడేపల్లిగూడెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయడంతోపాటు ఇక్కడ చదువుకునే విద్యార్థులకు మరింత సహకారాన్ని అందిస్తామని జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ అన్నారు. తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం విజయకేతనం 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశం స్వామి, ఎన్‌వీ సత్యనారాయణ, పాలూరి వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, డీఈఓ, ఎంఈఓలు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

పెనుగొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ములపర్రు పంచాయతీలో నిధులు దుర్వినియోగం ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో శుక్రవారం డీఎల్‌పీవో జి.రాణి, బిఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి, ఎ.ఏవో సీహెచ్ బాలహనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్య ప్రకాశరావు గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులను విచారించారు. పాత రికార్డులు, నిధుల దుర్వియోగం జరిగిన అక్రమాలకు సంబంధించి దస్త్రాలు, బిల్లులు చెల్లింపులు వివరాలను పరిశీలించారు.

ఇసుక అక్రమ రవాణా

ఆచంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ఆచంట నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు ఆధ్వర్యంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స నారాయణకు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బొత్స దృష్టికి తీసుకువెళ్లారు.



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోగుల సహాయకులు ఇలా..


తంగెళ్ళమూడిలో ఫుట్‌పాత్‌పై పేదల నిద్ర

చలి ముసుగులో..

చలి పెరిగింది. రాత్రి వేళ్లల్లో మరింత అధికంగా వుంది. ప్రజలు ఇళ్లల్లో ముసుగులు తీయడం లేదు. ఇక దిక్కూ మొక్కు లేని వాళ్లు.. పనిపై ఏలూరు నగరానికి వచ్చిన వారు.. ఇలా ఆరుబయటే.. రోడ్లపక్కన, పుట్‌పాత్‌లపైన నిద్రిస్తున్నారు. ఓ వైపు చలి, మరోవైపు దోమల బాధతో విలవిల్లాడుతూనే దుప్పటి ముసుగులో సేద తీరుతున్నారు. కాస్త చలి పెరిగితే ఇలా చలి మంట వేసుకుని సేద తీరుతున్నారు. ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కిన దృశ్యాల్లో కొన్ని.. - ఏలూరు ఫొటోగ్రాఫర్


ఏలూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద చలి మంట


ఏలూరు వన్‌టౌన్‌లో చిరు వ్యాపారులు


ఆర్ఏ పద్ధతిలో ఆక్వా సాగు

సాగు క్షేత్రాన్ని పరిశీలించిన మత్స్యశాఖ కమిషనర్


ఆక్వా సాగు క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్

పెనుమంట్ర, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):పొలమూరులో ఆదర్శ రైతు గంటా సాయి వినూత్న పద్ధతుల్లో ఆక్వా సాగు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. పెనుమంట్రకు చెందిన గంటా రామ దుర్గారావు తనయుడు వెంకట సాయిరాం సింగపూర్‌లోని బయో టెక్నాలజి అనుసంధానం చేస్తూ ఆక్వా సాగును ప్రారంభించారు. దేశంలోనే తొలి సారిగా జిల్లాలో పెనుమంట్ర మండలం పొలమూరులో బయోటెక్నాలజీ ఆర్ఏ సిస్టం ద్వారా వినూత్న సాగు చేస్తూ ఆక్వా రంగంలో అగ్రగామిగా నిలుస్తున్నాడు. ఆర్ఏఎస్ (రీ సర్క్యులేట్ ఆక్వా కల్చర్ సిస్టం) ఆక్వా సాగు క్షేత్రాన్ని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ రమా శంకర్ నాయక్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. క్షేత్ర స్థాయిలో రొయ్యల సాగుతో పాటు కొరమేను సాగు ఆశాజనకంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రొయ్యల చేపల సాగులో వర బయో ఆర్ఏఎస్ వైరస్ సోకే ప్రమాదం లేదని కమిషనర్ రమా శంకర్ నాయక్ తెలిపారు. ఫీడ్ ఖర్చు తగ్గి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ మత్స్యశాఖ డైరెక్టర్ లక్ష్మణరావు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేష్, మత్స్యశాఖ ఏడీఏ ఆర్‌వీఎస్ ప్రసాద్, ఎఫ్ డీవో శ్రీనివాస్ ఆదర్శ రైతు గంటా వెంకట సాయి రామ్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి తెప్పోత్సవం



భీమవరం లోసరి కాలువలో సుబ్రహ్మణ్య స్వామి తెప్పోత్సవం.. పక్క చిత్రంలో స్వామి, అమ్మవార్లు

భీమవరం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి లోసరి కాల్వలో వైభవంగా వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వైభవంగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పల్లకీలో ఆలయం వద్ద నుంచి కాల్వ వరకు మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులతో తీసుకు వచ్చారు. స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన తెప్పలో ఉంచి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇవ్వడంతో తెప్ప ముందుకు సాగింది. భారీఎత్తున బాణ సంచా కాల్చారు. ఆలయ ఈవో దండు కృష్ణంరాజు పర్యవేక్షించారు. ముందు జాగ్రత్త చర్యగా టూటౌన్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

బోనాలతో ఊరేగింపు



ఏలూరు కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పడమర వీధిలో జరుగుతున్న గంగానమ్మ జాతరలో భాగంగా బోనాలు, డప్పు వాయిద్యాలతో గణాచార్యులు వీధివీధిన ప్రదర్శన జరిపి ప్రజలకు ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులు బోనాలతో వచ్చిన గణాచార్యులకు స్నానోత్సవాలు నిర్వహించి పువ్వులు, పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపి ఆరాధిస్తున్నారు.

సెల్‌ఫోన్‌లో ఏం చూస్తున్నారు ?

విద్యార్థులకు కలెక్టర్ ప్రశ్న


తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

తణుకు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):సెల్‌ఫోన్ చూస్తున్నారా, సెల్‌ఫోన్‌లో ఏం చూస్తున్నారు అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రశ్నించారు. శుక్రవారం తణుకు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ మీలో చాగంటి కోటేశ్వరరావు రచించిన విలువల విద్య పాఠాలు ఎంతమంది చూశారు అని ప్రశ్నించారు. సెల్‌ఫోన్ కొద్ది సమయం చూడటం తప్పులేదని విజ్ఞానాన్ని పెంచుకునే విషయాలను తెలుసుకోవడానికి మాత్రమే దానిని వినియోగించుకోవాలన్నారు. తప్పుగా ఉండే వాటికి ఎట్టి పరిస్థితుల్లో ఆకర్షితులు కాకూడదని, అవి మీ జీవితాన్ని అగాథంలోకి నెట్టేస్తాయన్నారు. విద్యతోనే భవిష్యత్ ఉంటుందని అన్నారు. పది తర్వాత ఏ కోర్సులు చేయవచ్చో ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు. ఐటిఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ వంటి కోర్సులు జీవితంలో త్వరగా స్థిరపడటానికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఇటీవల సైన్సు ఫెయిర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాధికను జిల్లా కలెక్టర్ అభినందించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ డేకి తప్పకుండా మీ తల్లిదండ్రులు తీసుకురాలని సూచించారు. విద్యార్థుల అసెస్మెంట్ బుక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కౌసర్ బానో, డీఈవో నారాయణ, ఎంఈవో ఆంజనేయులు, హెచ్ఎం పద్మావతి, తహసీల్దార్ అశోక్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

వైఎన్ కళాశాల అభివృద్ధికి కృషి

నరసాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):'విద్యాపరంగా వైఎన్ కళాశాలకు ఎంతో చరిత్ర ఉంది, మెగాస్టార్, రెబల్‌స్టార్, దాసరి వంటి హిరో దర్శకులతోపాటు ఎంతో మంది హైకోర్టు న్యాయమూర్తులు, మేధావులు ఈ కళాశాలలో చదివి ఉన్నతస్థితిలో ఉన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తాన'ని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు. శుక్రవారం కాలేజీలో యూజీసీ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన హాస్టల్ భవనాన్ని ప్రభుత్వ విప్ నాయకర్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. విప్ నాయకర్ మాట్లాడుతూ విద్యకు, క్రమశిక్షణకు వైఎన్ మారుపేరన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ కార్పొరేట్ కాలేజీలకు దీటుగా వైఎన్ బోధనలు ఉండటం వల్లే నేటికి కాలేజీ క్రేజ్ తగ్గలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్న మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులకు విద్య బోధనలు చేసి ఉన్నతస్థితికి తీసుకొచ్చిన ఘనత వైఎన్‌కు ఉందన్నారు. డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, అందే సతీశ్, చైర్‌పర్సన్ వెంకటరమణ, కోటిపల్లి వెంకటేశ్వరావు, మాదంశెట్టి కోటేశ్వరరావు, వలవల నాని పాల్గొన్నారు.


చైర్‌పర్సన్ వెంకటరమణ, సమస్యలపై గళం విప్పిన సభ్యులు

నరసాపురంలో సమస్యలపై సభ్యుల ధ్వజం

నరసాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడ చూసినా.. చెత్త కుప్పలు, రోడ్లపై గోతులు, డ్రైయినేజీల్లో పూడుకుపోయిన సిల్ట్, చీకటి పడితే వెలగని వీధి దీపాలు, దోమల బెడద, ఈ సమస్యలకు కారణం పురపాలక సిబ్బంది పనితీరంటూ శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు గళం విప్పారు. గురువారం వాయిదా పడిన సమావేశం తిరిగి శుక్రవారం చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షత జరిగింది. వీసీ కొత్తపల్లి నాని మాట్లాడుతూ పురపాలకానికి ఏటా రూ.7కోట్లు ఆదాయం వస్తుంది, ఆ దిశగా అభివృద్ధి లేదు, అన్ని బాక్స్ టెండర్లతో చక్కబెట్టేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ఆయనకు జతగా కోటిపల్లి సురేష్, వన్నెంరెడ్డి శ్రీను, వైకెఎస్, జయరాజు, ఆడిదెల శ్యామల, సఖినేటిపల్లి సురేష్, దుర్గాభవాని, సిర్రా కాంతమ్మలు మాట్లాడుతూ వార్డుల్లోకి వెళితే ప్రజలు సమస్యలపై దుమ్మెతిపోస్తున్నారంటూ మండిపడ్డారు. కమిషనర్‌గా మీరు బాధ్యతలు చేపట్టి 18 నెలలు అయింది, ఏం అభివృద్ధి జరిగిందో చెప్పాలంటూ నిలదీశారు. దీనికి కమిషనర్ అంజయ్య నుంచి సమాధానం రాలేదు. అనసవరమైన పనులకు నిధులు వెచ్చించి పురపాలక సొమ్మును వృథా చేశా'నంటూ ధ్వజమెత్తారు.

హోరాహోరీగా నెట్ బాల్ పోటీలు

నేటితో ముగియనున్న పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

పాలకోడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల 69వ స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల నెట్ బాల్ పోటీలు పాలకోడేరు మండలం శృంగవృక్షం క్రీడా మైదానంలో రెండు రోజులుగా నువ్వా నేనా అన్నట్లుగా పోటీలు సాగుతున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ఆ గ్రామం మొత్తం సందడి వాతావరణం నెలకొన్నది. ఈ పోటీల్లో రాణించిన 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నారు. దీంతో ఆయా జిల్లాల నుంచి వచ్చిన నెట్ బాల్ జట్టు సభ్యులు ఎవరికి వారు ఆంధ్రప్రదేశ్ టీమ్ తరపున ఆడేం దుకు తమ సత్తాను చాటే విధంగా గేమ్‌ను ఆడుతున్నారు. నేటితో పోటీలు ముగియనున్నాయి. 312 మంది విద్యార్థుల్లో నెట్‌బాల్‌లో బాగా రాణించిన 13 జిల్లాలకు చెందిన విద్యార్థుల్లో 12 మందితో కూడిన బాలుర జట్టును మరో 12 మందితో కూడిన బాలికల జట్టును ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన జట్టు డిసెంబర్ నెలలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారు. ఈ పోటీల్లో పాల్గొన్న పలువురు క్రీడాకారులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



చదువుతోపాటు పాఠశాలల్లో క్రీడలు ఆడే విధంగా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించాలి. ఒక్క చదువుకే కాకుండా ఆటలు ఆడుకునే విధంగా ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలి. అప్పుడే గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు తయారవ్వడానికి అవకాశం ఉంటుంది.

- పి.చందు వెంకట నిఖిల్ (విశాఖపట్నం)

సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాల ల్లో క్రీడా సామగ్రి కొరత ఉంది. పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి. గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులు తయారవ్వాలంటే ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై చదువుకు ఇస్తున్న ప్రాముఖ్యతను క్రీడల పట్ల కూడా చూపాలి.

- పెద్దదేవర నవాజ్ (అనంతపురం)

ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తా



పశ్చిమ గోదావరి జిల్లా తరపున తన సత్తా చాటి ఏపీ జట్టుకు ఎంపికై నెట్ బాల్ పోటీల్లో రాణిస్తా. జాతీయ స్థాయిలో నెట్ బాల్ పోటీల్లో రాణించాలన్నదే నా కోరిక. అందుకనుగుణంగానే చదువుకుంటూనే నెట్ బాల్‌ను ప్రాక్టీస్ చేసి ఉద్యోగం సాధించాలన్నదే నా జీవిత లక్ష్యం.

- పి. అను, గొరగనమూడి, (ఉమ్మడి పశ్చిమ గోదావరి)

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా



నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే చాలా ఇష్టం. పీడీ సూచనలతో నెట్ బాల్ ప్రాక్టీస్ చేస్తు న్నా. తద్వారా జిల్లా జట్టుకు ఎంపికయ్యా. జిల్లా జట్టులో రాణించి రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడమే కాకుండా జాతీయ జట్టులో స్థానం పొందడమే లక్ష్యంగా పెట్టుకున్నా. క్రీడలు ఆడుతూనే చదువుకుని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా.

- పి. బిందు శ్రీ మంజు, గొరగనమూడి (ఉమ్మడి పశ్చిమ గోదావరి)

క్రీడలంటే ఇష్టం



చదువుతోపాటు క్రీడలు చాలా ఇష్టం. బాల్ బ్యాడ్మింటన్‌తోపాటు నెట్ బాల్‌లో రాణిస్తున్నా. జిల్లా జట్టు తరపున బాగా ఆడి జిల్లాకు పేరు తేవడమే కాకుండా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తా. బాగా చదివి డాక్టర్‌ను అయ్యి పేదలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం.

- సీహెచ్. సితార, (తూర్పు గోదావరి)

బాలికల్లో పశ్చిమ, విశాఖ ఫైనల్స్

బాలురలో తూర్పు, విశాఖ జట్లు


ఫైనల్స్‌కు చేరిన ఉమ్మడి పశ్చిమ బాలికలు

పాలకోడేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ నుంచి పశ్చిమగోదావరి జిల్లా శృంగవృక్షం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 13 ఉమ్మడి జిల్లాల అండర్-14 స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలు నువ్వా నేనా అన్నట్లు ఆయా జట్ల మధ్య జరిగాయి. ఆయా జిల్లాల నుంచి 312 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన నెట్ బాల్ పోటీల్లో బాలికలు విభాగంలో కృష్ణా జట్టుపై పశ్చిమ గోదావరి జిల్లా జట్టు 11-5 గోల్స్‌తో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. మరో జట్టు తూర్పు గోదావరిపై విశాఖపట్నం జిల్లా జట్టు 19-3తో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. అదే విధంగా బాలుర జట్టు పశ్చిమ గోదావరిపై తూర్పు గోదావరి జిల్లా జట్టు 12-10 తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. మరో మ్యాచ్‌లో నెల్లూరుపై విశాఖపట్నం బాలుర జట్టు 18-6 గోల్స్‌తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. శనివారం బాలురు, బాలికల జిల్లా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లు సాగనున్నాయని నిర్వాహకులు ఖుద్దూస్, చిట్టిబాబు, విజయలక్ష్మి, అబ్జర్వర్ కల్పన, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సునీత, మల్లేశ్వరరావు తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో భీమేశ్వర్, ఉద్యోగులు

పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

జడ్పీ డిప్యూటీ సీఈవో భీమేశ్వర్

ఏలూరు సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల పారదర్శకతకు, జవాబుదారీతనానికి దోహదపడేలా సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారని ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ డిప్యూటీ సీఈఓ కె. భీమేశ్వర్ అన్నారు. సమాచార హక్కు చట్టంపై జడ్పీ ఉద్యోగులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమేశ్వర్ మాట్లాడుతూ ఏదైనా ప్రభుత్వ సంస్థ నిర్ణయాలు, ప్రణాళికల పట్ల సామాన్యులు కూడా అజమాయిషీ చేసే విధంగా ఈ చట్టం రూపొందించారన్నారు. ఏదైనా కార్యాలయంలో ఆ కార్యాలయ పరిధికి సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారాన్ని మాత్రమే ప్రజలు కోరితే ఇవ్వటం జరుగుతుందన్నారు. జడ్పీ ఏఓలు ఐవీ రాఘవులు, కూరపాటి జాన్సన్, కనకరాజు, పద్మావతి, సీతామహలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.


నూజివీడులో మానవహారంతో ప్రజాసంఘాల నిరసన

ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలి

నూజివీడులో రెండో రోజూ జేఏసీ నిరసన

నూజివీడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా శనివారం నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రాస్తారోకో, మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రజల ఆకాంక్షల మేరకు నడుచుకోవాలని, గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టాలని కోరారు. నూజివీడు జేఏసీ కోశాధికారి చాట్ల పుల్లారావు, జేఏసీ నాయకుడు ఎం. సునీల్‌కుమార్, బార్ అసోసియేషన్ నాయకులు వైయస్ దొర్రై, అర్జున్‌రావు, హరిబాబు, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'వాసవి పెనుగొండ'పై అభ్యంతరాలుంటే తెలపాలి

కలెక్టర్ వెట్రిసెల్వి ప్రకటన విడుదల

పెనుగొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):పెనుగొండ మండలం పెనుగొండ గ్రామం పేరును వాసవి పెనుగొండగా మార్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, జిల్లా పరిధిలో నివశిస్తున్న వ్యక్తుల నుంచి ఈ పేరుకు సంబంధించి ప్రతిపాదనలు, అభ్యంతరాలు, సూచనలను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై అభ్యంతరాలు, సూచనలు ఇంగ్లీష్, తెలుగులో రాత పూర్వకంగా ఉండాలని ఈ ప్రకటన తేదీ నుంచి 30 రోజులు పూర్తి అయ్యే రోజున లేదా అంతకుముందుగా జిల్లా కలెక్టర్, భీమవరం వారికి చేరేలా పంపించాలని కలెక్టర్ తెలిపారు.

ఫిట్‌లెస్ బస్సులు


జంగారెడ్డిగూడెంలో మరమ్మతులకు గురైన ప్రైవేట్ స్కూల్ బస్సు

- తరచూ మొరాయిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు
- బుజ్జగించి నడుపుతున్న డ్రైవర్‌లు
- వారం రోజులపాటు జిల్లాలో స్పెషల్ డ్రైవ్
- స్కూల్ బస్సుల సామర్థ్యం, నిబంధనల అమలుపై తనిఖీలు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):పలు విద్యాలయాల బస్సులు ఫిట్‌నెస్ కోల్పోయి మొరాయిస్తున్నాయి. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అధికారులు వచ్చి హడావుడి చేయడమే తప్పా మిగతా సమయంలో ఎటువంటి చర్యలు ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. స్కూల్ బస్సుల పనితీరు ఎలా ఉంది..? అవి కండిషన్‌లో ఉన్నాయా..? ఏదైనా ప్రమాదం పొంచి ఉందా..? డ్రైవర్‌లు సక్రమంగా వాహనాలను నడుపుతున్నారా అనే వాటిపై ఎప్పటికప్పుడు అధికారుల తనిఖీలు చేయాలని కోరుతున్నారు. అయితే వారం రోజులపాటు రవాణా శాఖాధికారులు ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షించనున్న క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తరచూ తనిఖీలు చేయాలి...

ఏలూరు జిల్లాలో మొత్తం 1150 ప్రయివేట్ స్కూల్ బస్సులున్నాయి. ఎల్‌కేజీ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ వరకు విద్యార్థులు నిత్యం ఈ బస్సులపై రాకపోకలు సాగిస్తారు. అయితే ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు మే నెలలో రవాణా శాఖాధికారులు జిల్లాలోని స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తారు. ఆ తరువాత ఎవరూ ఆ బస్సులను పట్టించుకోరు. అలా కాకుండా ప్రతి మూడు నెలలకు బస్సులను తనిఖీలు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. అలాగే డ్రైవర్లకు అవగాహన కల్పించడం, రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో తమను తాము కాపాడుకునేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించడం, బస్సు డ్రైవర్ల సామర్థ్య పరిశీలనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వారం పాటు ఫ్రెండ్లీ చెకింగ్...

జిల్లా కలెక్టర్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆదేశాలతో వారం రోజుల పాటు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. బస్సుల్లోని భద్రతా లోపాలను గుర్తిస్తే వెంటనే విద్యా సంస్థలకు రవాణా శాఖాధికారులు నోటీసులు ఇస్తారు. వాహన ఫిట్‌నెస్, ట్యాక్స్, పర్మిట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌ల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేస్తారు.

స్కూల్ బస్సుల తనిఖీ..


పాలకొల్లు, తణుకులో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు శ్రీనివాస్, అజ్మీర్ భద్రు తదితరులు



తణుకు : పట్టణంలోని పలు విద్యా సంస్థల బస్సులను రవాణాశాఖాధికారి ఎస్.శ్రీనివాసు తనిఖీ చేశారు. శుక్రవారం రవాణాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు బస్సులు ఫిట్‌నెస్, అత్యవసర ద్వారాలు, సీట్లు, డ్రైవర్ లైసెన్స్ వంటి పరిశీలించారు. నిబంధనలు పాటించని ఒక బస్సును సీజ్ చేసినట్లు శ్రీనివాసు తెలిపారు. నిబంధనల మేరకు నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తల్లిదండ్రులు కూడా పరిశీలించాలి

తాడేపల్లిగూడెం టౌన్: విద్యార్థులు ప్రయాణించే బస్సులను తల్లిదండ్రులు కూడా పరిశీలించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్ కోరారు. పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం స్కూల్, కళాశాల బస్సుల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయక్, భీమవరం అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ బస్సుల్లో ఏమైనా లోపాలు తల్లిదండ్రులు గుర్తిస్తే తక్షణమే యాజమాన్యానికి తెలపాలని వారు స్పందించకపోతే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. మొత్తం 51 బస్సులు తనిఖీ చేయగా 31 బస్సుల్లో లోపాలు గుర్తించి నోటీసులిచ్చామన్నారు. మరో ఏడు రోజుల్లో మళ్లీ తనిఖీలు చేస్తామని అప్పటిలోగా బస్సులు పూర్తి కండిషన్‌లో ఉంచాలన్నారు.

10 బస్సుల్లో భద్రతా లోపాల గుర్తింపు

పాలకొల్లు టౌన్: పట్టణంలోని విద్యాసంస్థలకు చెందిన బస్సులు, వాహనాలను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజ్మీర బద్దు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పి తేజ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవీఐ అజ్మీర్ బద్దు మాట్లాడుతూ పట్టణంలో 25 స్కూల్ బస్సులు తనిఖీ చేయగా 10 బస్సుల్లో భద్రత లోపాలను గుర్తించి యజమానులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు.

తప్పిపోయిన 20 గంటల్లోనే బాలుడి అప్పగింత


బాలుడిని అప్పగిస్తున్న ఎస్సై వీర ప్రసాద్

జంగారెడ్డిగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ రాత్రి ఇంటి నుంచి ఆడుకునేందుకు వెళ్లి తప్పిపోయిన బాలుడిని పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించారు. ఎస్సై ఎన్.వీర ప్రసాద్ వివరాల ప్రకారం కైకరం గ్రామానికి చెందిన గుడిపూడి విద్యాధరరావు భార్య మృతి చెందడంతో స్థానిక బిల్డర్ నిర్మించిన భవనంలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ అదే ఇంట్లో తన కుమారుడితో ఉంటున్నాడు. ఈ నెల 27వ తేదీ రాత్రి బాలుడు ఇంటి నుంచి బయటకు ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో అతని తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై వీర ప్రసాద్ తన సిబ్బందితో పట్టణంలో గాలించగా స్థానిక వెంకయ్య స్వామి ఆశ్రమం వద్ద రాత్రంతా చలిలో పడుకుని శుక్రవారం ఉదయం స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్ వద్ద ఉన్న బాలుడిని గుర్తించి తండ్రికి అప్పగించారు. పోలీసులకు బాలుడి తండ్రి కృతజ్ఞతలు తెలియచేశాడు.

రైళ్ల పొడిగింపు



ఏలూరు క్రైం, నవంబరు 28(ఆంధ్ర జ్యోతి):దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్న రైళ్ళను ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా మరి కొంతకాలం నడపడానికి చర్యలు తీసుకుని ఆ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. రైల్ నెంబర్ 01477 షోలాపూర్-అనకాపల్లి ప్రతి శుక్రవారం నడుస్తున్న ఈ రైలును ఈ ఏడాది డిసెంబరు 5 నుంచి డిసెంబరు 26వ వరకు పొడిగించారు. 01478 అనకాపల్లి - షోలాపూర్ కు ప్రతి శనివారం నడుస్తున్న ఈ ప్రత్యేక రైలును డిసెంబరు 6 నుంచి 27 వరకు పొడిగించారు. రైల్ నెంబర్ 08311 సంబల్‌పూర్ - ఈరోడ్ (బుధవారం) డిసెంబరు 3 నుంచి 31 వరకు పొడిగించారు. 08312 ఈరోడ్ - సంబల్‌పూర్ (శుక్రవారం) డిసెంబరు 5 నుంచి జనవరి 2 వరకు పొడిగింపు, 08583 విశాఖ - తిరుపతి (సోమవారం) డిసెంబరు 1 నుంచి డిసెంబరు 29 వరకూ పొడిగింపు. 08584 తిరుపతి - విశాఖపట్టణం (మంగళవారం) డిసెంబర్ 2 నుంచి డిసెంబరు 30 వరకు పొడిగింపు. 08547 విశాఖ - తిరుపతి (బుధవారం) డిశంబరు 3 నుంచి 31 వరకూ పొడిగింపు. 08548 తిరుపతి - విశాఖ (గురువారం) డిశంబరు 4 నుంచి జనవరి 1 వరకు పొడిగింపు, 08579 విశాఖ - చర్లపల్లి (శుక్రవారం) డిసెంబరు 5 నుంచి 26 వరకు, 08580 చర్లపల్లి - విశాఖ (శనివారం) డిసెంబర్ 6 నుంచి 27 వరకు, 08581 విశాఖ- ఎస్ఎంవీటి బెంగళూరు (ఆదివారం) డిసెంబరు 7 నుంచి 28 వరకు, 08582 ఎస్ఎంవీటీ బెంగళూరు-విశాఖ (సోమవారం) డిసెంబరు 8 నుంచి డిసెంబరు 29 వరకూ, 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ (శనివారం) డిసెంబరు 6 నుంచి 27 వరకూ, 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ (సోమవారం) డిసెంబరు 8 నుంచి 29 వరకూ, 02841 షాలిమార్ (కోల్‌కత్తా)- ఎంజీఆర్ చెన్నై (సోమవారం) డిసెంబరు 1 నుంచి 29 వరకూ, 02842 ఎంజీఆర్ చెన్నై - షాలిమార్ (కోల్‌కత్తా) (బుధవారం) డిసెంబరు 3 నుంచి 31 వరకూ పొడిగింపు. 07225 చెర్లపల్లి - షాలిమార్ (సోమవారం) డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 30 వరకు పొడిగింపు. 07226 షాలిమార్ - చర్లపల్లి (మంగళవారం) డిసెంబరు 2 నుంచి 2026 మార్చి 31 వరకూ పొడిగిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద చెట్టున్నపాడు గ్రామస్థుల ధర్నా

చేపల చెరువు వివాదాన్ని పరిష్కరించాలి

ఏలూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం చెట్టున్నపాడులో చేపల చెరువుల లీజుల విషయమై రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం పరిష్కరించి, గ్రామస్థులందరికీ సమానంగా దక్కాల్సిన చేపల చెరువుల లీజులు దక్కేలా చూడాలని కోరుతూ చెట్టున్నపాడు గ్రామస్థులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో అర్జీ ఇస్తే నేటికీ పట్టించుకోలేదని మండిపడ్డారు. గ్రామస్థులు దేవదాసు శ్రీను, బోజప్ప, కాకర్ల రాజు తదితరులు మాట్లాడుతూ గ్రామస్థులందరి అంగీకారంతో మాత్రమే చేపల చెరువులకు లీజులు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. చెట్టున్నపాడు దళిత కుటుంబాల్లో 18 మంది గ్రామ పెద్దల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. వారిని తప్పించాలని డిమాండ్ చేశారు. వన్నెకూటి రామారావు, చిగురుపాటి ఏసురత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీవర్షిణికి మంత్రి లోకేశ్ అభినందన


తాను గీసిన డ్రాయింగ్‌ను మంత్రి లోకేశ్‌కు అందిస్తున్న విద్యార్థిని శ్రీవర్షిణి

యలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మేడపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆకుమర్తి శ్రీవర్షిణి మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఆవరణలో నారా లోకేశ్‌ను కలిసిన శ్రీవర్షిణి తాను గీసిన నారా లోకేశ్ డ్రాయింగ్‌ను మంత్రి లోకేశ్‌కు అందించింది. డ్రాయింగ్స్ బాగున్నాయి.. కీప్ ఇట్ అప్.. అంటూ మంత్రి లోకేశ్ శ్రీవర్షిణిని అభినందించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ డ్రాయింగ్స్‌ను వారికి అందజేయాలనుకున్నానని శ్రీవర్షిణి మంత్రి నారా లోకేశ్‌కు చెప్పింది. ఆ డ్రాయింగ్స్‌ను కూడా తీసుకున్న మంత్రి నారా లోకేశ్ వాటిని వారికి అందజేస్తానని ఆమెకు చెప్పారు.

ఏలూరు జిల్లా పేరు మార్చాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను ఉత్తర గోదావరి లేదా గోదావరి జిల్లాగా పేరు మార్పు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ఈ సమావేశంలో అధిక సంఖ్యలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోదావరి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలు జిల్లాల పేర్లు మార్చుతుండడంతో ఏలూరు జిల్లాను ఉత్తర గోదావరి జిల్లాగాను లేదా గోదావరి జిల్లాగానైనా పేరు మార్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. క్యాబినెట్ సబ్ కమిటీని కలిసి వినతి పత్రం సమర్పించాలని, సోషల్ మీడియా, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సహకారంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని తీర్మానించారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు దాసరి శ్యామ్ చంద్రశేషు, పరిమి సత్తిపండు,పెనుమర్తి రామకుమార్, నంబూరి రామచంద్రరాజు, షేక్ ముస్తఫా, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి శ్రీనివాసరావు, మల్లాది సీతారామారావు, కొప్పాక శ్రీనివాసరావు, ప్రగడపాటి కాశీ, మద్దాల ప్రసాద్, కర్పూరం గవరయ్య గుప్తా, ఓరుగంటి నాగేంద్ర, సిటీకేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగ్గురు డీజిల్ దొంగల అరెస్టు


నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న ఎస్సై వీరప్రసాద్, ఏఎస్సై సంపత్

జంగారెడ్డిగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):రాత్రి సమయాల్లో జాతీయ రహదారుల్లో నిలిపి ఉన్న లారీలలో డీజిల్ దొంగిలిస్తున్న పల్నాడు జిల్లాకు చెందిన ముదావత్ స్వామి నాయక్, ముదావత్ బాలకృష్ణ నాయక్, మురాతు శ్రీను నాయక్ అనే ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై ఎన్.వీర ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 27వ తేదీ గురువారం తెల్లవారు జామున బైపాస్ రోడ్డులోని లారీ కార్యాలయం వద్ద ఆపిఉన్న లారీలో డీజిల్ దొంగిలిస్తుండగా లారీ డ్రైవర్ అరవడంతో అతన్ని చాకుతో చంపుతామని బెదిరించి కారులో పారిపోయారు. ఈ ఘటనపై లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టారు. శుక్రవారం పట్టణ శివారులోని రామచర్లగూడెం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి కారు వెనక్కి తిప్పి పారిపోతుండడంతో కారును అడ్డుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు డీజిల్ దొంగిలించే ముఠా అని తేలిందన్నారు. అనేక జిల్లాల్లోని జాతీయ రహదారుల్లో నిలిపి ఉన్న వాహనాల్లో డీజిల్ దొంగింలించినట్లు విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. వారి నుంచి టాటా ఇండిగో కారు, కారు డిక్కీలో ఉన్న 30 లీటర్ల డీజిల్‌తో ఉన్న డబ్బా, ఏడు ఖాళీ డబ్బాలు,డీజిల్ పైపు, బ్లేడు, చాకు స్వాధీనం చేసుకున్నారు.

గేదెలను హతమార్చిన నిందితుని అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

లింగపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం సుందరావుపేటలో గత జూన్‌నెలలో మూడు పాడిగేదెల తలలు నరికి దారుణంగా హతమార్చిన ఘటనలో నిందితుడైన దాసరి రంగారావును అరెస్టు చేసినట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. ఏలూరుకు చెందిన దాసరి రంగారావు తన భార్యను తరచూ కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తుండటంతో ఆమె లింగపాలెం మండలంలోని సుందరావుపేటలోని పుట్టింటికి వచ్చింది. తన భార్య కాపురానికి రాకుండా ఆమె కుటుంబసభ్యులు అడ్డుకుంటున్నారని కోపంతో వారిపై కక్షపెంచుకుని వారిని ఇబ్బందులకు గురిచెయ్యాలనే ఉద్దేశ్యంతో గత జూన్ నెల 26వ తేదీన అర్ధరాత్రి సుందరావుపేటలోని ఆమె బంధువులకు చెందిన మూడు గేదెలను కత్తితో నరికి చంపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఎవరికీ కనిపించకుండా మహారాష్ట్ర పారిపోయినట్లు తెలిపారు. నిందితుని కదలికలపై నిఘా ఏర్పాటు చేశామని, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా దాసరి రంగారావు శుక్రవారం ధర్మాజీగూడెం వచ్చినట్లు సమాచారం రావడంతో ఎస్ఐ వెంకన్న సిబ్బందితో కలసి రంగారావును అరెస్టు చేసినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

డ్రెయిన్‌లోకి దూకిన వ్యక్తిని కాపాడిన పోలీసులు


యనమదుర్రు డ్రెయిన్‌లో దూకిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

భీమవరం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకాడు. వెంటనే స్పందించిన పోలీసులు అతనిని కాపాడారు. భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్‌కు చెందిన ఈది రమేష్ శుక్రవారం మధ్యాహ్నం చిన్న వంతెనపై నడుచుకుంటూ వెళ్ళి ఒక్కసారిగా యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకేశాడు. అక్కడున్నవారు చూసి కేకలు వేయడంతో జనమంతా గుమిగూడారు. సమాచారం అందుకున్న టూటౌన్ కానిస్టేబుళ్ళు ఆదిరెడ్డి నరసింహా, మహంతి నాగేశ్వరరావులు భారీ తాళ్ళు తీసుకువచ్చి డ్రెయిన్‌లోకి వేసి ఆ వ్యక్తిని కాపాడారు.

అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి అతని తల్లికి అప్పగించారు. వెంటనే స్పందించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్ళను ఉన్నతాధికారులు అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

నిడమర్రు నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :మండలపర్రు శివారు రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఎస్సై ఎస్.ఎన్.వి.వి. రమేష్ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 11,670 రూపాయల సొమ్మును స్వాధీనం చేసుకొని తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు



ద్వారకాతిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని ఆలయాన్ని బాంబ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు శుక్రవారం తనిఖీలు నిర్వహించాయి. ప్రముఖ క్షేత్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు జరిపినట్లు బృంద సభ్యులు తెలిపారు. వీరా పేరుతో ఉన్న డాగ్ ద్వారా ఈతనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, గోపురాలు, అనివేటి మండప ప్రాంతం, ప్రసాదాల కౌంటర్లు, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఇతర ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు.

సెక్యూరిటీ గార్డుపై ఆలయ అధికారులకు ఫిర్యాదు

ద్వారకాతిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఓ వ్యక్తిపై అతని మామ ఆలయ ఈవోకు, చీఫ్ సెక్యూరిటీ అధికారికి శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ ప్రతిని విలేకర్లకు పంపాడు. అందులోని వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవినేనివారిగూడెంకు చెందిన పెండెల ఏసురత్నం కుమార్తె లిల్లీప్రియ. ఈమె భర్త ద్వారకాతిరుమలకు చెందిన తాళ్లూరి సతీష్ దేవస్థానంలో గార్డుగా పనిచేస్తున్నాడు. అతనితో 2022లో లిల్లీప్రియకు కులాంతర ప్రేమ వివాహం జరిగింది. వీరికి గతేడాది పాప జన్మించింది. ఏడాది కాలంగా భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. లిల్లీప్రియ ఫిర్యాదు మేరకు ఈ ఏడాది ఆగస్టులో ఏలూరు మహిళా పోలీస్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. దీంతో ఇలాంటి వ్యక్తి దేవాలయంలో పనిచేస్తే ఆలయ పవిత్రతకు భంగం కలుగుతుందని తగుచర్యలు తీసుకోవాలంటూ ఏసురత్నం ఆలయ అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు చేశాడు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం


మంటలు అదుపుచేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఫుడ్‌వేవ్స్ రెస్టారెంట్ వంట గదిలో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలు అదుపుచేసి ప్రమాదాన్ని నివారించా రు. అగ్నిమాపక అధికారి మురళికొండబాబు తెలిపిన వివరాల ప్రకారం వంట చేస్తుండగా నూనెమూకుడిలో మంటలు వ్యాపించాయి. వెంటనే పక్కనే ఉన్న అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనం సిబ్బంది వెళ్లి మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తినష్టం లేకుండా నివారించారు.

10 వాహనాలపై కేసుల నమోదు

పెదపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించి, అతివేగంగా ప్రయాణిస్తున్న 10 వాహనాలపై పెదపాడు పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద జాతీయరహదారిపై ఎస్సై కట్టా శారదా సతీష్, ఏఎస్సై గజపతిరావులు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించారు. వాహన తనిఖీల్లో పెదపాడు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన ముగ్గురి అరెస్టు

అత్తిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ కట్టా శివకుమార్‌పై దాడి చేశారనే ఆరోపణపై ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. అత్తిలికి చెందిన తిరుపతి గణేష్ మరో ఇద్దరిని తణుకు సీఐ కృష్ణకుమార్ అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారిని తణుకు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చిత్రకళ పోటీల్లో అప్పనవీడు విద్యార్థులకు బంగారు పతకాలు

పెదపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌కు చెందిన ప్రొగ్రెస్ ఆఫ్ ఆర్ట్ బడ్స్ వారు నిర్వహించిన చిత్రకళ పోటీల్లో అప్పనవీడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని హెచ్ఎం తోట పుష్పవతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎం.నవీన్‌కుమార్, చంద్రిక, జయగేయశ్రీదుర్గ బంగారు పతకాలు సాధించగా, సీహెచ్ ప్రణీత, ఎస్.కె.రహమాన్, జ్యోతి స్వరూప, రాంచరణ్, ధరణి జ్యూరీ హానర్ రాజా రవివర్మ అవార్డును అందుకున్నారు. శుక్రవారం విద్యార్థులను పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

'టెట్' మినహాయింపునకు ఎంపీకి వినతి

ఏలూరుఅర్బన్,నవంబరు28(ఆంధ్రజ్యోతి):ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించేలా సుప్రీంకోర్టు తీర్పును సవరించేందుకు రివ్యూ పిటిషన్ దాఖలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రయత్నించాలని ఎంపీ మహేష్‌యాదవ్‌కు అభ్యర్థించారు. శుక్రవారం ఎంపీని కలిసి వినతిపత్రాన్ని అందజేశామని యూటీఎఫ్ జిల్లా నాయకులు షేక్‌ముస్తఫాఅలీ, రవికుమార్ తెలిపారు. సంఘ నాయకులు మాట్లాడుతూ జనవరి 29న ఎస్టీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో భారీ ధర్నాను నిర్వహిస్తామన్నారు. నాయకులు సుభాషిణి, రంగమోహన్, శివశంకరరావు, తదితరులున్నారు.

'రహదారుల మరమ్మతుల్లో నాణ్యత పాటించాలి'


సోమవరప్పాడులో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు/పెదవేగి/పెదపాడు, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : రహదారులపై చేపట్టే మరమ్మతు పనుల్లో పూర్తిస్థాయిలో నాణ్యత పాటించి, పనులు పూర్తి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోమవర ప్పాడు-జంగారెడ్డిగూడెం రోడ్డులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టరుకు పలు సూచనలు చేశారు. చింతమనేని విష్ణు, టీడీపీ నాయకులు ఉన్నారు.

● పెదవేగి మండలం దుగ్గిరాల టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలువురు ప్రజలు సమస్యలను ఎమ్మెల్యే ప్రభాకర్‌కు విన్నవించారు. అర్హులందరికీ పింఛన్లు అందించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పెదపాడు మండలం కొత్తూరు, పెదపాడు గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులకు ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపే కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని పాల్గొన్నారు. అనంతరం రైతులకు సీఎం చంద్రబాబు నుంచి వచ్చిన అభినందన లేఖలను రైతులకు అందజేశారు.

రూ.3.77 కోట్ల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఏలూరుటూటౌన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి):పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా నియోజకవర్గంలో ఇప్పటివరకు 3కోట్ల 77లక్షల 93 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 43మందికి రూ.22లక్షల 30వేలు విలువైన చెక్కులు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రూ.25లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ పథకం ప్రారంభిస్తున్నామన్నారు. ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, బి.కిషోర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ధర్మరాజు


ఉంగుటూరులో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నిడమర్రు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రుణాల మంజూరు తదితర సమస్యలపై వచ్చిన విజ్ఞప్తులను ఆయన స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉంగుటూరు నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతల మేలుకే 'రైతన్నా మీకోసం'



'రైతన్నా మీకోసం'లో పాల్గొన్న ఎమ్మెల్యే సొంగా

లింగపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు మేలు చేసేందుకే 'రైతన్నా మీకోసం' నిర్వహిస్తున్నామని ఎమెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో శుక్రవారం 'రైతన్నా మీకోసం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో రైతులంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబునాయుడు రైతన్నా మీకోసం కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. రైతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి) : టెన్త్ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌కు బలమైన పునాది వేసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాల టెన్త్ విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా విజయకేతనం స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ఈ మెటీరియల్‌ను అందజేస్తుందన్నారు. ఎంఈవో కె.శ్రీనివాసరావు, ఎంఈవో 2. ఎస్.బుచ్చయ్యదొర, యు.మధు, జి.లక్ష్మణ్ ఉన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి'


వినతులను స్వీకరిస్తున్న బొరగం శ్రీనివాసులు

బుట్టాయగూడెం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం టీడీపీ ఆదేశాల మేరకు బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. కొన్ని వినతులపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ప్రజల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు మొగపర్తి సోంబాబు, జారం చాందినీ విద్యాసాగరిక, మడకం కన్నపరాజు, గద్దె అబ్బులు, కలగర రాము, పొట్టా రామారావు పాల్గొన్నారు.

'కొత్త చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి'

పోలవరం, నవంబరు28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం పోలవరంలోని శ్రీసాయి ఇంగ్లీషు మీడియం హైస్కూలులో సీఐ బాల సురేశ్‌బాబు ఆధ్వర్యంలో 'కొత్త చట్టాలు తెలుసుకోండి' కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ సంయుక్తంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం విడుదలపై పలువురి హర్షం

ఏలూరు రూరల్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని మసీదుల ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవ వేతనాలను ప్రభుత్వం విడుదల చేయడం పట్ల స్థానిక రైల్వేగేటు మసీదు కార్యవర్గ సభ్యులు హర్షం ప్రకటించారు. మసీదులోని ఇమామ్‌లకు నెలకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేలు చొప్పున మొత్తం 12 నెలలకు, ఒక లక్ష 80వేలు విడుదల కాగా వారికి అందజేసినట్లు తెలిపారు.

హోదా.. మారింది !

(5వ పేజీ తరువాయి)

మంత్రులతో మాట్లాడి వేగంగా అనుమతులు రావడానికి ఎమ్మెల్యే కృషి చేశారు.

కూటమి నాయకుల హర్షం

జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీని గ్రేడ్-1 మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అధ్యక్షతన స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమా వేశం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ కృషితో గ్రేడ్ -1 మునిసి పాలిటీగా ఏర్పడడం పట్ల కూటమి నాయకులు పరిమి సత్తిపండు,నంబూరి రామచంద్రరాజు,మేకా ఈశ్వరయ్య,కొప్పాక శ్రీనివాసరావు,పెనుమర్తి రామకుమార్,బొబ్బర రాజ్‌పాల్ కుమార్, చింతల నాని, గురజాల ఉమా మహేశ్వరి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


ఏలూరులో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటి, నాయకులు


పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు


ఏలూరులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

» ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరుటూటౌన్/ఏలూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని, సమ సమాజస్థాపనే ధ్యేయంగా అలుపెరగని పోరాటం చేశారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు జూట్‌మిల్ సెంటర్‌లో జరిగిన పూలే వర్ధంతి కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఆర్‌టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, వడ్డీల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటశాల వెంకటలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఈడా ఛైర్మన్ శివప్రసాద్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో ఎం.అశోక్‌కుమార్ అధ్యక్షతన పూలే వర్ధంతి కార్యక్రమం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నేతర అజయ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల జేఏసీ, ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జూట్ మిల్, జిల్లా పరిషత్ వద్ద గల జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వడ్డీ కార్పొరేషన్ ఛైర్మన్ ఘంటశాల వెంకటలక్ష్మి, బీసీ కులాల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ లంక వెంక టేశ్వరరావు, బీసీ నాయకులు గంటా ప్రసా ద్‌రావు, ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్ కుమార్, జిల్లా అధ్యక్షులు పామర్తి ఏసురాజు, బీసీ కులాలు నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, అశోక్‌గౌడ్, మార్గాని శ్రీనివాసరావు, ఎస్సీ నాయకులు అజయ్‌బాబు, పాల్గొన్నారు.

●చింతలపూడి/దెందులూరు/భీమడోలు/జంగారెడ్డిగూడెం : జ్యోతిరావుపూలే ఆశయాలను పరిగణ నలోకి తీసుకుని నడుచుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దెందులూరు మండలం దెందులూరు బీఆర్ డి.నర్సింగ్ కాలేజీ అధినేత సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో దెందులూరు విజయ నగేష్ నర్సింగ్ కాలేజీలో పూలే వర్ధంతి నిర్వహించారు. భీమడోలు టీడీపీ కార్యాల యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. భీమడోలు మండల టీడీపీ సమావేశంలో మండల అధ్యక్షుడు కరణం పెద్దిరాజు అధ్యక్షతన పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జంగారెడ్డి గూడెం పట్టణంలోని టీడీపీ కార్యాయంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, నంబూరి రామ చంద్రరాజు, పెనుమర్తి రామకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కుక్కల మాధవరావు, చిట్రోజు తాతాజీ, మానికల నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

సాహితీవేత్త పార్థసారథికి ఘన సన్మానం


పార్థసారథిని సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : సాహిత్య, కళా రంగానికి డాక్టర్ పార్థసారథి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు, సాహితీవేత్తలు కొనియాడారు. విజయవాడ మల్లెతీగ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రణాళికాధికారి డాక్టర్ టి.పార్థసారథిని సంస్థ అధ్యక్షుడు కమిలిశ్రీ ఘనంగా సత్కరించారు. మల్లెతీగ కమిలిశ్రీ మాట్లాడుతూ డాక్టర్ పార్థసారథి శ్రీశ్రీకళావేదిక ద్వారా నిరంతరాయంగా సాహిత్య సేవలు అందిస్తున్నారన్నారు. డా.పార్థసారథి రచనలు అనేకం ప్రచురితం అయ్యాయన్నారు. పలు విశ్వవిద్యాలయాలకు పరిశోధనా పత్రాలు సమర్పించారనీ సుమారు 2 వేల కవితలు రచించి, సాహిత్య సేవ, విద్యసేవ, సామాజిక సేవ చేస్తుండటం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి 'సమగ్రశిక్ష ఏపీసీ' అంగీకారం

ఏలూరుఅర్బన్,నవంబరు28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టి.నరసాపురం మండలం కృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులను నిర్మించడానికి తగిన చర్యలను ప్రారంభిస్తామని సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ హామీ ఇచ్చారని ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు మోహన్, హెచ్ఎంల సంఘ నాయకులు ప్రకాశ రావు తెలిపారు. స్కూలులో అదనపు తరగతిగదుల ఆవశ్యకతపై ఇటీవల సంఘ నాయకులు ఏపీసీని కలుసుకుని వినతిపత్రాన్ని అందజేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించారని వివరించారు. ఎంఈవోలు రామ్మూర్తి, కళ్యాణి, హెచ్ఎం లక్ష్మణరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ స్వప్నకుమారి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం'


మాట్లాడుతున్న ప్రవీణ్‌ధావర్

ఏలూరు రూరల్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి):ఏపీలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఏఐసీసీ పరిశీలకుడు ప్రవీణ్ ధావర్ తెలిపారు. శుక్రవారం ఏలూరు డీసీసీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యటించి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి డీసీసీ సారథి నియామకానికి కార్యకర్తల అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బలం పెంచుకుంటామన్నారు. డీసీసీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు, పెద్దిరెడ్డి సుబ్బారావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి జి.సత్యేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సీయూటీయూ మహాసభలు జయప్రదం చేయాలి

కుక్కునూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి ఐదు రోజుల పాటు జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోశమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. విశాఖపట్నంలో లక్షమంది కార్మికులతో భారీ ప్రదర్శన జరగబోతున్న క్రమంలో కార్మికులు, ప్రజలు మేధావులంతా జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు వై.సాయికిరణ్, కె.బాపనమ్మ, శ్రావణి, రమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలకు చర్యలు

కామవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వ్యాధిగ్రస్తులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య సేవలు అందించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఆయుష్ ఆర్‌డీడీ కె.వి.కుమార్‌బాబు అన్నారు. తడికలపూడిలోని హోమియో ఆసుపత్రిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆసుపత్రికి సొంత భవనం కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తానన్నారు. ఖాళీగా ఉన్న స్వీపర్, కాంపౌండ్ పోస్టులను భర్తీ చేస్తానని చెప్పారు. ఆసుపత్రి నిర్మాణానికి గతంలో బందెల దొడ్డి ఉండే ప్రాంతాన్ని పరిశీలించారు. డాక్టర్ రఫియా పర్వీన్ షేక్ ఉన్నారు.

'ఆదివాసీ నాయకులపై కేసులు తగవు'

కుక్కునూరు, నవంబర28(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండలం నర్సాపురం గ్రామంలో నల్లరాయి క్వారీ వల్ల నష్టపోతున్న ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో శాంతియుతంగా పోరాటాలు చేస్తున్నందుకు వారిపై దాడులు చేయడం, కేసులు పెట్టడం తగదని రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కూరం సంజీవరావు అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నల్లరాయి క్వారీ వల్ల ప్రజలకు ఆస్తినష్టం, పర్యావరణ కాలుష్యం జరుగుతుందన్నారు. తక్షణం క్వారీ మూసివేయాలని డిమాండ్ చేశారు.



ఏలూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ర్యాలీలో ఇంజనీర్లు, ఉద్యోగులు, ఎన్జీవో నాయకులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ

ఏలూరు/ఏలూరు క్రైం/కుక్కునూరు/ దెందులూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చిలకపాటి దేవ ప్రకాష్ సూచనలతో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం ఏలూరు సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ పుట్టా ధనుంజయులు ఆధ్వర్యంలో అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం చేపట్టారు. జలవనరులశాఖ ఇంజనీర్లు, ఉద్యోగులు, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ శనక్కాయ నరేష్‌కుమార్ సమాచారం తెలుసుకోవడం మీ హక్కు-చెప్పడం ప్రభుత్వ బాధ్యత అంటూ నినాదాలు చేశారు. ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా ర్యాలీని నిర్వహించారు. నీరు-ప్రగతి ఎస్ఈ వెంకట స్వామి, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, రాష్ట్ర జేఏసీ అసిస్టెంట్ సెక్రెటరీ ఆర్ఎస్ హరనాథ్, యాదా శ్రీనివాస్, జేఈలు పుట్టి సుబ్రహ్మణ్యం, పామర్తి సతీష్ పాల్గొన్నారు. ఏలూరు జిల్లా జైలులో సమాచార హక్కు చట్టంపై రిమాండ్ ఖైదీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. కారాగార సహాయ పౌర సమాచార అధికారి, జైలర్ కె.శ్రీనివాసరావు, జైలర్ వి.రమేష్, చీఫ్ హెడ్ వార్డు వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కుక్కునూరు మండలం కుక్కునూరులో తహసీల్దార్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సహచట్టంపై అవగాహన కల్పించారు. దెందులూరు మండలం దెందులూరులో ఎంఈవో ఏవీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-2 భాస్కర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవోల అమలుకు చొరవ చూపాలి : కట్లయ్య

ఏలూరు రూరల్, నవంబరు 28, (ఆంధ్ర జ్యోతి) : రజకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సూచనలు చేస్తూ, జీవోలు జారీ చేసినా వాటి అమలులో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఆచరణకు నోచుకోవడం లేదని రజక జన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఏలూరులోని రజక జనసంఘ జిల్లా కార్యాలయంలో రజక నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం 1984లో జారీ చేసిన జీవోల ప్రకారం ప్రతీ జిల్లాలోనూ రజక సంక్షేమ కమిటీలు గౌరవ కలెక్టరేట్ అధ్యక్షతన ఏర్పాటు చేయాల్సి ఉందని కానీ చాలా చోట్ల ఆచరణ కాలేదన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా రజక నేతలు కొమ్మంటి మురళి, కదిలి సుబ్బయ్య, శ్రీనివాసు, నాగేశు, లక్ష్మీప్రసన్న, ఈధర్ మురళి, అంజుత్తు నాగేశ్వరరావు, కడకట్ల సత్యనారాయణ, సురేష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నూతన మండల అధ్యక్షుడు కొండకు సన్మానం


కొండను సన్మానిస్తున్న పంచాయతీ సభ్యులు

పోలవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మంగిన కొండను శుక్రవారం పోలవరం పంచాయతీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కోరశిక శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో మంగిన కొండ కుటుంబం నుంచి ఒకేసారి ముగ్గురు పంచాయతీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికవడం అతడి సేవానిరతికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొదుం పుష్ప, కార్యదర్శి కొండలరావు, పట్నాల నారాయణరావు, అక్కాబత్తుల రాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని సీపీఐ ఆందోళన

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి):స్థానిక ఆర్టీసీ నిర్వహిస్తున్న డీజిల్ పెట్రోలు బంకులో జరిగిన రూ.83 లక్షల స్కాంలో దోషులుగా నిర్ధారణకాని నలుగురు ఉద్యోగులపై ఆర్టీసీ యాజమాన్యం విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ గ్యారేజి వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షలు చేస్తున్న ప్రతినిధులకు సంఘీభావాన్ని ప్రకటించారు. ఐదో రోజు దీక్షలో ఎం.ఎస్.రావు, పి.ఆర్.రావు, ఎస్.ఎస్.కుమార్, ఆర్.వి.శేఖర్, టి.కుమార్, వి.ఆర్.శేఖర్, జి.లక్ష్మి, ఎస్.మహేశ్వరి, కె.వి.నాగలక్ష్మిలకు మద్దతుగా ఏఐటీయూసీ నాయకులు, సీపీఐ నాయకులు కొద్దిసేపు ఆందోళనలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ నాయకులు ఎ.అప్పలరాజు, ఎస్.ఎం.వి.సుబ్బారావు, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యేశ్వరునికి వసంతోత్సవం


భక్తులపై వసంతాలు చల్లుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల,నవంబరు28(ఆంధ్ర జ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరుని వసంతోత్సవం శ్రీవారి క్షేత్ర పుర వీధుల్లో శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ముందుగా తొళక్క వాహనంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అలంకరించి అర్చకులు వసంతాలు సమర్పించారు. అంతకు ముందు ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు జరిపారు. ఆ తరువాత ధ్వజఅవరోహణ, మహాపూర్ణాహుతి హోమక్రతువును వైభవంగా నిర్వహించారు. ఈక్రమంలో క్షేత్ర పురవీధుల్లో ఊరేగించి వేడుకగా భక్తులపై వసంతాలను జల్లారు. శనివారం రాత్రి జరుగనున్న పుష్పయాగోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో..

ఏలూరుకార్పొరేషన్: మార్గశిర మాసం శుక్రవారం కావడంతో సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి భక్తులతో సామూహికంగా కుంకుమార్చన జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ కడవకొల్లు వెంకటేశ్వరరావు, ఆలయ అధ్యక్షులు కె.జి.ఎస్.వి.గోపాలకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పిల్లి సావిత్రమ్మ, నాగభూషణం, శ్రీనివాసరావు, మిత్రబృందం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసి సేవలందించారు. భక్తులు సామూహికంగా లలితా పారాయణం నిర్వహించారు.

మొబైల్ సిగ్నల్ సమస్యలకు పరిష్కారం : ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు పార్లమెంట్ పరిధిలో 2027 సంవత్సరం నాటికి మొబైల్ సిగ్నల్ నెట్వర్క్ సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జీఎం ఎల్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. 4జీ నెట్వర్క్, టవర్ల సమస్యలపై అధికారులను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 175 కొత్తటవర్ల ఏర్పాటుకు అనుమతులు లభించాయన్నారు. సంవత్సరంలోగా ఈ టవర్లను సిగ్నల్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిర్మించాలని ఆదేశించారు. దేశంలో నెట్వర్క్ సమస్య రాకుండా టవర్ల ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించే విధంగా బీఎస్ఎన్ఎల్ అధికారులు కృషి చేయాలన్నారు.


తనిఖీ చేస్తున్న ఆయుష్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ కేవీ కుమార్ బృందం

హోమియో వైద్యంపై నమ్మకం కలిగించండి

ఏలూరు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన హోమియో వైద్యంపై నమ్మకం కలిగేలా చేయాలని ఆయుష్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ కేవీ కుమార్‌బాబు సూచించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న హోమియోపతి, ఆయుర్వేదిక్, యునానిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. యునానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. సీనియర్ వైద్యాధికారులు డాక్టర్ కె.రాణి, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు అరికట్టాలి'

ద్వారకాతిరుమల, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): బాల్యవివాహాలు అరికట్టడం అందరి బాధ్యతని తహసీల్దార్ జేవీ సుబ్బారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా పరిమి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. సీడీపీవో బ్యూలా మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టేందుకు గ్రామాల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ఎంఈవో వెంకట్రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేరి, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు రాజేష్, రవి, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

బుట్టాయగూడెం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): బుట్టాయగూడెం మండల మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నామని సీపీఐ మండల కార్యదర్శి చోడెం దుర్గ తెలిపారు. శుక్రవారం జరిగిన ఎన్నికలో అధ్యక్ష, కార్యదర్శులుగా చోడెం రమణ, బుద్దుల ముత్యాలమ్మ మరో 13 మందితో కమిటీని ఎంపిక చేశామన్నారు. నాయకులు మహిళలు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

జీలుగుమిల్లి, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వి.క్రాంతికుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో వచ్చే పలు రకాల యాప్‌లను డౌన్‌లోడు చేయడం, ఒటీపీ వంటి సందేశాలతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అమరశ్రీకి సేవామణి అవార్డు

పెదపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లయన్స్ నాయకుడు, సామాజిక కార్యకర్త అమరశ్రీకి గట్టెం మాణిక్యాలరావు, సరోజిని దంపతులు ఏలూరులో సేవామణి పేరుతో వైద్య సేవా అవార్డును అందజేశారు. ఉచిత గుండె వైద్య శిబిరాలు, కంటి శస్త్రచికిత్సా శిబిరాలు నిర్వహించినందుకు ఈ అవార్డును అందజేసినట్టు అమరశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టరు జి.పూర్ణిమ శిరీష, గురజాడ శ్రీకాంత్, ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తడికమళ్ల శివసత్యనారాయణ, ఉడతా రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు పురస్కారాలు

భీమడోలు,నవంబరు28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. భీమడోలుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కీర్తిశేషులు కఠారి కోరుకొండ నాగేశ్వర నరసింహమూర్తి మాస్టారు. కోరు మాస్టారు స్మారక ప్రతిభా పురస్కారం పేరు ఆయన కుమారులు పుణ్యమూర్తి ఈ అవార్డులను అందజేస్తున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన భీమడోలు హైస్కూలు విద్యార్థినులు స్నేహగీతిక, సుధాభార్గవి, యశస్వినిలకు నగదు బహుమతి, షీల్డును అందజేశారు. కఠారి రామ్మూర్తి, పణిరాజుకుమారి, ఎంఈవో శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్, హెచ్ఎం అహ్మద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

జీలుగుమిల్లి, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి తాటియాకులగూడెం, పి.రాజవరం గ్రామాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు జంగారెడ్డిగూడెం ఈఈ ఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.



పాఠశాలకు మైక్ సెట్ వితరణ

చాట్రాయి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌కు నూజివీడుకు చెందిన దాత గుప్త శ్రీనివాసరావు రూ. 18 వేలు విలువైన మైక్‌సెట్‌ని శుక్రవారం అందజేశారు. దాత శ్రీనివాసరావుకు హెచ్‌ఎం ఎం అప్పారావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలిదిండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం కోరుకొల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని జాగ్రత్తపర్చుకోవాలన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గిట్టుబాటు ధర పొందాలన్నారు.

ప్రజా దర్బార్‌కు 74 అర్జీలు



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న దృశ్యం

నూజివీడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి క్యాంప్ కార్యాలయంలో శుక్ర వారం అధికారుల సమక్షంలో ప్రజాదర్బార్ నిర్వ హించి మొత్తం 74 అర్జీలు స్వీకరించా రు. నిర్ణీత గడువులోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. నూజివీ డు మున్సిపల్ కమిషనర్ పీరయ్య, నూజివీడు, ఆగిరిపల్లి మండల తహసీ ల్దార్లు, బద్రు, ప్రసాద్, ఆగిరిపల్లి ఎంపీడీవో భార్గవి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలి

రెండో రోజు కొనసాగిన నిరసనలు

నూజివీడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజక వర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా శనివారం నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రాస్తారోకో, మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రజల ఆకాంక్షల మేరకు నడుచుకోవాలని గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టాలని కోరారు. నూజివీడు జేఏసీ కోశాధికారి చాట్ల పుల్లారావు, జేఏసీ నాయకుడు ఎం. సునీల్‌కుమార్, బార్ అసోసియేషన్ నాయకులు వైయస్ దొరై, అర్జున్‌రావు, హరిబాబు, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పారదర్శకత పెంపునకే స.హ. చట్టం

ముసునూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపే సమాచార హక్కు చట్టం ప్రధాన లక్ష్యమని తహసీల్దార్ దాసరి ప్రశాంతి అన్నారు. శుక్రవారం ముసునూరులో సమాచార హక్కు చట్టం-2005పై రెవెన్యూ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగహన సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ సామాన్యుడు ఏ కార్యాలయానికి వెళ్ళినా పని చేయించుకోవటం, తనకు కావలసిన సమాచారాన్ని తెలుసుకోవడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ సమాచార హక్కు చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందని, దీనిపై ప్రజలు అవగహన పెంచుకోవాలని, సమాచారాన్ని పొందాలనుకునే పౌరులు రాతపూర్వకంగా నిర్దిష్ట రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తమ శర్మ, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు, స్థానికులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సమాచార హక్కు చట్టంపై ఎంఈవో-1 ఎస్. హేబేలు, ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం 2005 సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హేబేలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాలధారులకు కలశ పాత్రలను అందజేస్తున్న దాత అప్పారావు

మాలధారులకు కలశ పాత్రల వితరణ

కైకలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సకల మాల ధారులకు పడిపూజ నిర్వహించేందుకు 18 కలశ పాత్రలను త్రీఎస్ ఫుడ్స్ యజమాని అనుమ కొండ అప్పారావు, బేబీశ్యామల దంపతులు అందజేశారు. శుక్రవారం కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ పాత్రలను స్వాములకు అందజేశారు. మండవల్లికి చెందిన కరేటి చంటి, కుంచే సత్యం గురుస్వాములు ఈ కలశ పాత్రలకు పూజలు నిర్వహించి అందించారు. ఆంజనేయస్వామి మాలధారులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కైకలూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ నిర్మించినట్టు సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు అన్నారు. శుక్రవారం కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వోప్లాంట్‌ను సర్పంచ్ ప్రారంభించారు. యర్నేని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆర్థిక సాయంతో ఈ ప్లాంట్ నిర్మించారు. ప్రతిరోజూ ప్రజలకు ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన జలాలను అందిస్తామని, జలాలను తాగునీరు అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. ఉపసర్పంచ్ నాగనబోయిన సురేశ్, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

యువతకు ఆదర్శం పూలే



కైకలూరులో పూలే విగ్రహం వద్ద టీడీపీ నేతల నివాళి

కైకలూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే సామాజిక కార్యకర్తగా, సంఘ సంస్కర్తగా అందించిన సేవలు నేటి యువత ఆచరిం చాలని టీడీపీ కైకలూరు సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా కైకలూరులోని ఆయన విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవివక్షను రూపుమాపడానికి, అణగారిన వర్గాల ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపడానికి ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. మహిళా విద్యకు ప్రాధాన్యత నిచ్చి అంటరానితనం రూపుమాపడానికి పోరాడిన మహనీయుడని కొనియాడారు. కార్పొరేషన్ల డైరెక్టర్లు కొడాలి వినోద్, పీజేఎస్ మాల్యాద్రి, టీడీపీ కో-కన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, గంగుల శ్రీదేవి, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, కైకలూరు పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, మైనార్టీ నాయకులు ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, బషీర్, బాజానీ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, విగ్రహ కమిటీ అధ్యక్షుడు పళ్లెం పుణ్యేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ భిక్షాలు, నాయకులు జన్ను వీర వెంకటేశ్వరరావు, మహ్మద్ రిజ్వాన్, ఈడే శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, ఎంపీటీసీ కోటేశ్వరరావు, నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ముదినేపల్లిలో పూలేకు విగ్రహ నిర్మాణ కమిటీ నివాళి



పూడికతీత ప్రారంభిస్తున్న జోగిరాజు

న్యూ డ్రెయిన్ పూడికతీత

కలిదిండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మట్టగుంట న్యూ డ్రెయిన్ పూడికతీత పనులను టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు నీటి సంఘాల అధ్యక్షులతో కలసి శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ డ్రెయిన్ కిక్కిస, డెక్క, తూడుతో పూడిపోవటంతో మురుగు నీటి పారుదల నిలిచి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు పంటుపై ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. కిక్కిస, డెక్క తొలగించటంతో సుమారు 1000 ఎకరాలకు ముంపు సమస్య తొలగిపోతుందన్నారు. వైసీపీ హయాంలో డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టకపోవటంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. డీసీ వైస్ చైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, భాస్కరరావుపేట, కొండంగి నీటి సంఘాల అధ్యక్షులు మంతెన సుబ్బరాజు, ఇమ్మానేని చంద్రశేఖర్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కుల వెంకటాపురం తదితరులు పాల్గొన్నారు.



జియో ట్యాగింగ్ చేస్తున్న దృశ్యం

సాకారం కానున్న పేదల సొంతింటి కల

చాట్రాయి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రతి పేదవాడి సొంతింటి కల తప్పక నెరవేరుతుందని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద చనుబండలో జరుగుతున్న కొత్త ఇళ్ల మంజూరుకు జియో ట్యాగింగ్‌ను శుక్రవారం టీడీపీ నాయకులతో కలసి పరిశీలించి మాట్లాడుతూ వచ్చే మూడేళ్లలో 17 లక్షల ఇళ్ళు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవటం గొప్ప విషయం అన్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులకు మంత్రి పార్థసారథి బిల్లులు విడుదల చేయించటంతో పేదలకు ఎంతో ఊరట కలిగిందన్నారు. టీడీపీ నాయకులు నక్కా రాము, ఎం శ్రీను, కటకం కృష్ణయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

హోదా.. మారింది!

(5వ పేజీ తరువాయి)

మంత్రులతో మాట్లాడి వేగంగా అనుమతులు రావడానికి ఎమ్మెల్యే కృషి చేశారు.

కూటమి నాయకుల హర్షం

జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీని గ్రేడ్-1 మునిసి పాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అధ్యక్షతన స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమా వేశం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ కృషితో గ్రేడ్ -1 మునిసి పాలిటీగా ఏర్పడడం పట్ల కూటమి నాయకులు పరిమి సత్తిపండు, నంబూరి రామచంద్రరాజు,మేకా ఈశ్వరయ్య,కొప్పాక శ్రీనివాసరావు,పెనుమర్తి రామకుమార్,బొబ్బర రాజ్‌పాల్ కుమార్, చింతల నాని, గురజాల ఉమా మహేశ్వరి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సూర్యఘర్‌కు ప్రాధాన్యం ఇవ్వండి

నూజివీడు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో సూర్యఘర్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచించారు. నూజివీడు ఇండోర్ సబ్‌స్టేషన్ ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నూజివీడు డివిజన్ ఈఈ, డీఇఇ, ఏఈఈలతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బ్రేక్ డౌన్స్, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్, పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రెవెన్యూ వసూళ్లు నూరుశాతం సాధించాలని, విద్యుత్ అంతరాయం తగ్గించాలని, లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని, పీఎం సూర్యఘర్‌లో మరింత ప్రగతి సాధించాలని ఆదేశించారు. డైరెక్టరు టెక్నికల్ మురళీకృష్ణయాదవ్, ఎస్ఈ హనుమయ్య, ఈఈ టెక్నికల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎండీ పుల్లారెడ్డి

మాలలు విద్యా రంగంలో రాణించాలి : శేషయ్య

ముదినేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాలలు విద్యా రంగంలో రాణించాలని, అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రకారం లభించిన రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ ఏపీ జోనల్ ఇన్‌చార్జి మదిర శేషయ్య అన్నారు. ముదినేపల్లిలో శుక్రవారం మాలమహానాడు, అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు శావా నాగ జగన్ బాబూరావు ఆధ్వర్యంలో ఆత్మీక కలయిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషయ్య మాట్లాడుతూ సమాజంలోని బడుగు బలహీన వర్గాల వారిని కూడా సోదర భావంతో కలుపుకుని పోవాలని కోరారు. దళిత సంఘ రాష్ట్ర నాయకులు సత్తెనపల్లి కిషోర్, జై మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోగులమూడి రాము, లంకపల్లి ఆనంద్, చుక్కా రాణి, గూడపాటి వర ప్రసాద్, అందుగుల ప్రతాప్, ఏపీయూడబ్ల్యూజె జిల్లా కార్యవర్గ సభ్యుడు వనాబత్తిన విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వనసమారాధన నిర్వహించారు.



ముదినేపల్లిలో ఐక్యతా ప్రదర్శన

రైతుల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

ముసునూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు దేవినేని డలరాం, గ్రామ అధ్యక్షుడు గార్లపాటి నరసింహారావు అన్నారు. శుక్రవారం ముసునూరులో 'రైత న్నా మీ కోసం'లో భాగంగా నాయకులు, అధి కారులు ఇంటింటికి వెళ్ళి అన్నదాతలకు పంచసూత్రాలపై అవగాహన కల్పించి, అన్నదాత సుఖీభవ పథకంలో ఆర్థికంగా చేకూరుతున్న లబ్ధిని వివరించి కర పత్రాలను అందజేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలను రైతులు సాగుచేసి, ఆర్థికంగా బలోపేతం కావాలని ఏవో ఏ.చాముండేశ్వరీ కోరారు. నాయకులు సాంబ శివరావు, పవన్‌కుమార్, రాజాబాబు, మద్దాల జాన్, విహెచ్‌ఏ దుర్గాబాయి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ముసునూరులో రైతులకు కరపత్రాలను అందజేస్తున్న నాయకులు, అధికారులు

వ్యవసాయ బోర్ కేబుల్ దొంగల అరెస్టు

నూజివీడు/ముసునూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలై మోటార్ కేబుళ్లను దొంగిలించి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న కేబుల్ దొంగలను నూజివీడు సర్కిల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు వైఎస్సార్ కాలనీకి చెందిన పూజారి ప్రభుకుమార్, మరో ముగ్గురు కలిసి ఉమ్మడి కృష్ణాజిల్లా, ఏలూరు జిల్లాల పరిధిలో వ్యవసాయ బోర్లను లక్ష్యంగా చేసుకుని వైర్లను దొంగిలిస్తున్నారని, ఇటీవల కాలంలో మోటార్ వైర్ల దొంగతనాలు పెరడంతో ఆ దిశగా దృష్టి సారించిన నూజివీడు సర్కిల్ పోలీసులు నూజివీడు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ముసునూరు ఎస్ఐ చిరంజీవి ముసునూరులో వాహన తనిఖీలు చేపట్టగా ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో ఉమ్మడి కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లాల పరిధిలో వ్యవసాయ బోర్ల కేబుల్ దొంగతనాలు విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో ఏలూరు వైయస్సార్ కాలనీకి చెందిన పూజారి ప్రభుకుమార్, కర్రి వెంకట జస్వంత్, అబ్బు శ్రీనివాసరావులతో పాటు మరో మైనర్ ను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఒక ద్విచక్ర వాహనంతో పాటు 400 మీటర్లు కేబుల్ వైర్‌ను 20 కిలోల రాగి వైరును స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. కేసును పరిష్కరించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ చిరంజీవిని, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.



నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ

భక్తులతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కిటకిట



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్, ఉత్సవ కమిటీ పూజలు

ముదినేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): షష్ఠి కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పుట్టలో పాలు పోసి స్వామివార్లను దర్శించుకున్నారు. తమ కోర్కెలు తీర్చాలంటూ నాగమల్లి చెట్టుకు ముడుపులు కట్టి నాగ ప్రతిమలకు పూజలు చేశారు. శుక్రవారం కావటంతో మహిళలు పెద్ద సంఖ్యలో పొంగళ్లు వండి సుబ్రహ్మణ్యేశ్వరుడి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, నీలం శివ రమేష్, దగాని నాగలక్ష్మీ, బెజవాడ నాగ వెంకట రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండు రంగారావు, మాజీ ఎంపీపీ పోసిన కుమారి తదితరులు పూజలు నిర్వహించారు.



విద్యార్థినులతో హెచ్‌ఎం అనూరాధ

జాతీయ పోటీలకు బాలికోన్నత పాఠశాల విద్యార్థులు

నూజివీడు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు నూజివీడు బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎన్నికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. అనూరాధ తెలిపారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో ఇటీవల జరిగిన క్రీడా పోటీలలో కృష్ణా జిల్లా జట్టు తరపున ఆడిన తమ విద్యార్థినులు ఎం. కావ్య, శ్రీ నీలిమ రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో వీరు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. వీరిని అభినందించారు.



యూటీఎఫ్ అధ్యక్షుడిగా బాబూరావు

నూజివీడు టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నూజివీడు మండలం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొద్దుకొళ్ళ బాబురావు, మల్లెల చెన్నకేశవ ఎన్నికయ్యారు. శుక్రవారం నూజివీడు యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో వీరు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గంగేయుడు తదితరులు అభినందించారు.

హిందూ మహా సమ్మేళనానికి తరలిరావాలి

చాట్రాయి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కేతనకొండ నేతాజీ స్కూల్ గ్రౌండ్స్‌లో డిసెంబరు 14న జరిగే హిందూ మహా సమ్మేళనానికి తరలిరావాలని చనుబండలో హిందూ నాయకులు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, కొంతగుండ్ల రమేష్, ఇజ్జిగిరి కేశవ, నడిపల్లి కిషోర్, భూషణం పాల్గొన్నారు.

బోధనలో సహకారం కోసమే టీచ్ టూల్ శిక్షణ

ఆగిరిపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బోధనలో ఉపాధ్యాయులకు సహకారం అందించడానికే టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి-2 కొవ్వలి ఆనంద్‌కుమార్ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు. శిక్షణా తరగతుల కో-ఆర్డినేటర్‌గా కొవ్వలి ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు సాంబశివరావు, యామినీ కృష్ణ, ప్రియ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కైకలూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అడపా కేదారి అన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఎయిడ్స్‌పై పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించి అవగాహన కల్పించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె. రమేష్, వి. సంధ్య, ఎం గోపి, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ళ పొడిగింపు

ఏలూరు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్న రైళ్ళను ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా మరి కొంతకాలం నడపడానికి చర్యలు తీసుకుని ఆ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రైల్‌నెంబర్ 01477 షోలాపూర్- అనకాపల్లి ప్రతి శుక్రవారం నడుస్తున్న ఈ రైలును ఈ ఏడాది డిసెంబరు 5 నుంచి డిసెంబరు 26వ వరకు పొడిగించారు. 01478 అనకాపల్లి - షోలాపూర్ కు ప్రతి శనివారం నడుస్తున్న ఈ ప్రత్యేక రైలును డిసెంబరు 6 నుంచి 27 వరకు పొడిగించారు. రైల్ నెంబర్ 08311 సంబల్‌పూర్ - ఈరోడ్ (బుధవారం) డిసెంబరు 3 నుంచి 31 వరకు పొడిగించారు. 08312 ఈరోడ్ - సంబల్‌పూర్ (శుక్రవారం) డిసెంబరు 5 నుంచి జనవరి 2 వరకు పొడిగింపు, 08583 విశాఖ - తిరుపతి (సోమవారం) డిసెంబరు 1 నుంచి డిసెంబరు 29 వరకూ పొడిగింపు. 08584 తిరుపతి - విశాఖపట్టణం (మంగళవారం) డిసెంబర్ 2 నుంచి డిసెంబరు 30 వరకు పొడిగింపు. 08547 విశాఖ - తిరుపతి (బుధవారం) డిశంబరు 3 నుంచి 31 వరకూ పొడిగింపు. 08548 తిరుపతి - విశాఖ (గురువారం) డిశంబరు 4 నుంచి జనవరి 1 వరకు పొడిగింపు, 08579 విశాఖ - చర్లపల్లి (శుక్రవారం) డిసెంబరు 5 నుంచి 26 వరకు, 08580 చర్లపల్లి - విశాఖ (శనివారం) డిసెంబర్ 6 నుంచి 27 వరకు, 08581 విశాఖ- ఎస్ఎంవీటి బెంగళూరు (ఆదివారం) డిసెంబరు 7 నుంచి 28 వరకు, 08582 ఎస్ఎంవీటీ బెంగళూరు-విశాఖ (సోమవారం) డిసెంబరు 8 నుంచి డిసెంబరు 29 వరకూ, 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ (శనివారం) డిసెంబరు 6 నుంచి 27 వరకూ, 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ (సోమవారం) డిసెంబరు 8 నుంచి 29 వరకూ, 02841 షాలిమార్ (కోల్‌కత్తా)- ఎంజిఆర్ చెన్నై (సోమవారం) డిసెంబరు 1 నుంచి 29 వరకూ, 02842 ఎంజీఆర్ చెన్నై - షాలిమార్ (కోల్‌కత్తా) (బుధవారం) డిసెంబరు 3 నుంచి 31 వరకూ పొడిగింపు. 07225 చెర్లపల్లి - షాలిమార్ (సోమవారం) డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 30 వరకు పొడిగింపు. 07226 షాలిమార్ - చర్లపల్లి (మంగళవారం) డిసెంబరు 2 నుంచి 2026 మార్చి 31 వరకూ పొడిగిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.